సాక్షి
మంచిర్యాల
శనివారం । 9 । మార్చి । 2024



దండేపల్లి: గండ దీపానికి మొక్కుతున్న మహిళ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల గోదావరి తీరాన శివుడికి భక్తుల అభిషేకం

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూముల రక్షణ కమిటీ ఏర్పాటు

బెల్లంపల్లి: మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా రక్షించడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ విభాగాలకు చెందిన 20 మంది అధికారులతో కమిటీ ఏర్పడింది. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ కమిటీ సభ్యుల పేర్లను శుక్రవారం వెల్లడించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే సదరు కమిటీ విచారణ చేస్తుందని, భూ ఆక్రమణదారుల వద్ద ఉన్న దస్త్రాలను పరిశీలించి ఆ పత్రాలు అసలైనవో, నకిలీవో తేలుస్తారని, బోగస్ ఇంటి నంబర్లు, భూముల కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తిస్తారని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కమిటీ సభ్యులు వీరే..

కమిటీలో సభ్యులుగా వి.ఆదిలక్ష్మి, టి.విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, టి.తిరుపతి, బి.కార్తీక్, ఎ.దేవిదాస్(రెవెన్యూ), బి.శ్యాం, రాజశేఖర్, ఐ.కుమార్, టి.ఉదయ్, యాకూబ్(మున్సిపాలిటీ), బి.శ్రీనివాస్, రంజిత్, హరికృష్ణ, రాజలింగు, కిషన్(పంచాయతీ రాజ్), ఎస్‌డీ.మజారుద్దీన్, ఆర్.తిరుపతి(ఏఎస్సై), కె.జ్యోతి, ఎస్.సుజాత(కానిస్టేబుళ్లు) ఉన్నారు.

హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించడాన్ని చూసి ఓర్వలేక అనుచిత వాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, లక్ష్మీనారాయణరావు, సుధీర్, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగికి జీరో కరెంట్ బిల్లు



బిల్లు చూపిస్తున్న రఫిక్

బెల్లంపల్లి: పట్టణంలోని ఓ రైల్వే ఉద్యోగికి గృహజ్యోతి పథకం వర్తింపజేస్తూ విద్యుత్ సిబ్బంది జీరో బిల్లు జారీ చేశారు. సదరు ఉద్యోగి దరఖాస్తు చేసుకోకున్నా జీరో బిల్లు వర్తింపజేయడం గమనార్హం. పట్టణంలోని 9వ వార్డు పరిధి రైల్వే రడగం బాల బస్తీకి చెందిన రఫిక్ మహమ్మద్ దక్షిణ మధ్య రైల్వే ఇంజినీరింగ్ విభాగంలో ట్రాక్ మెన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటి విద్యుత్ బిల్లు రూ.104వచ్చిందని.. గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేసి జీరో బిల్లు ఇచ్చారు. దరఖాస్తు చేసుకోకున్నా బిల్లు రాయితీ వర్తింపజేయడమేమిటని నివ్వెరబోయాడు. విద్యుత్ అధికారులు విచారణ చేయకుండా బిల్లు ఇవ్వడం చర్చనీయాంశమైంది. 2013లో రఫిక్‌కు రైల్వే ఉద్యోగం వచ్చింది. అంతకుముందు తెల్ల రేషన్‌కార్డు ఉండగా, ఉద్యోగం వచ్చినప్పటి నుంచి రేషన్ సరుకులు తీసుకోవడం మానేశాడు.

హరహర మహాదేవ



జైపూర్: వేలాలలో దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేక్ దంపతులు, స్థానిక నాయకులు



పాతమంచిర్యాల గోదావరి నదిలో..



గోదావరి నదిలో భక్తురాలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో శివనామస్మరణ మారుమోగింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలకు భక్తజనం పోటెత్తింది. మంచిర్యాల గోదావరి నదీ తీరమంతా పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన వేలాది మంది భక్తజన సందోహంతో నిండిపోయింది. గోదావరిలో అవతలి వైపు(గోలివాడ వైపు) నీరు ప్రవహించడంతో కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి స్నానాలు ఆచరించాల్సి వచ్చింది. కొందరు షవర్ల కింద స్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి నది ఒడ్డున ఉన్న గౌతమేశ్వర ఆలయంలో పూజలకు బారులు తీరారు. గంటలకొద్దీ వేచి చూసి శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక విశ్వనాథ ఆలయం, కోదండ రామాలయంలో మహాన్యాస పూర్వక అభిషేక పూజలు నిర్వహించారు. గోదావరి స్నానాలకు వచ్చిన భక్తులకు ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య ప్రగతి సమాజ్, యువమంచ్, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్నూర్ కాపు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గొంగళ్ల శంకర్ ఆధ్వర్యంలో అల్పాహారం, పండ్లు, మంచినీళ్లు అందజేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు.



మంచిర్యాలలో దంపతుల పూజలు

వ్యర్థాలతో వ్యథ..

మహా శివరాత్రి సందర్భంగా మంచిర్యాల గోదావరి నది స్నానాలకు వచ్చిన భక్తులు వ్యర్థాలతో ఇబ్బందులు పడ్డారు. ఇదివరకు కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నిండుగా నీరు ఉండడం వల్ల ముల్కల్ల గోదావరికి భక్తులు వెళ్లేవారు. ఈ ఏడాది పూర్తిగా నీటి ప్రవాహం తగ్గిపోవడంతో గోలివాడ వైపు ప్రవహిస్తున్న గోదావరి నీటిలో స్నానాలకు భక్తులు తరలివచ్చారు. ఇటీవల ముగిసిన సమ్మక్క జాతరతో మిగిలిపోయిన వ్యర్థాలు అలానే ఉండడంతో భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఏడాదికోసారి వచ్చే భక్తులకు కనీసం దుస్తులు మార్చుకునే తాత్కాలిక షెడ్లు లేకపోవడంపై పెదవి విరిచారు.

వేలాల.. భక్త జనసంద్రం

- శివ నామస్మరణతో మార్మోగిన మల్లన్న గట్టు
- బోనాలు పోసి, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- కన్నుల పండువగా మల్లిఖార్జునస్వామి కల్యాణ మహోత్సవం



ఢమరుకం మోగిస్తున్న ఒగ్గు పూజారులు

జైపూర్: మండలంలోని వేలాల జాతరకు భక్తజనం పోటెత్తింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వేలాల పులకించిపోయింది. అటవీ ప్రాంతంలోని గట్టు మల్లన్న సన్నిధి శివనామస్మరణతో మారుమోగింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ప్రారంభమైన జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్‌భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్, నిజామాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని సిరొంచ, గడ్చిరోలి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సమీప గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో గట్టు మల్లన్న స్వామి సన్నిధికి చేరుకున్నారు. దర్శనానికి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. దొనలో స్వయంభూగా వెలిసిన మల్లస్వామి(శివలింగం)ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, లయబద్ధ నృత్యాలు, లక్ష్మీదేవరుల ప్రదర్శనలు, ఒగ్గు పూజారుల ఢమరుకం మోతలతో వేలాల గట్టు దద్దరిల్లింది. ఉపవాస దీక్షలతో మల్లస్వామికి బోనాలు పోసి పట్టువస్త్రాలతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. కుటుంబ సభ్యులతో కలిసి రాత్రంతా జాగారం చేశారు. గుట్టపై దొనను ఏటేటా తొలిచి వెడల్పు చేయడంతో భక్తుల దర్శనం కొంత సులభతరంగా మారింది. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్, ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో 800మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. 50పైగా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల నిఘా నీడన జతర సాగింది. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, రామగుండం సీపీ శ్రీనివాస్ గట్టు మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర బందోబస్తుపై సీపీ శ్రీనివాస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

వైభవోపేతంగా కల్యాణ మహోత్సవం

వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయంలో రాత్రి 7గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. భక్తులు కనులారా వీక్షించారు.



ముల్కల్ల గోదావరి నదిలో భక్తుల స్నానాలు



అల్పాహారం పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



దండేపల్లి: గూడెం మహాలింగేశ్వర ఆలయంలో అభిషేకం

ఘనంగా బుగ్గ జాతర

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- ఎమ్మెల్యే వినోద్ ప్రత్యేక పూజలు

బెల్లంపల్లిరూరల్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కన్నాల పంచాయతీ పరిధి బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జాతర ఘనంగా సాగింది. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దైవ దర్శనం కల్పించారు. ఆలయ సమీపంలోని కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎమ్మెల్సీ దండే విఠల్, బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముఖేష్, ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం వంశీ, మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, స్వామి, రవి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారా యణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వినోద్‌కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బుగ్గకు వెళ్లే మట్టి రోడ్డుపై నీటిని చల్లకపోవడంతో భక్తులకు దుమ్ము బాధ తప్పలేదు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు ఇతర సుదూర ప్రాంతాల నుంచి లక్షకు పైగా మంది భక్తులు బుగ్గ జాతరకు తరలివచ్చారు. వాహనాల పార్కింగ్ కోసం భక్తుల నుంచి అధిక రుసుం వసూలు చేయడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐలు అఫ్జలుద్దీన్, దేవయ్య, కుమారస్వామి, సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వాలంటీరులు భక్తులకు సేవలందించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్



చెన్నూర్‌రూరల్: కత్తెరసాల మల్లన్న దర్శనానికి భక్తుల బారులు



జైపూర్: వేలాలలో లక్ష్మీదేవరుల పూనకాలు



వేలాలలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది. విశ్వనాథస్వామి ఆలయం నుంచి దేవతామూర్తులను సన్నాయిమేళాల మధ్య పూలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదపండితులు, అర్చకులు నరహరిశర్మ, బాలక్రిష్ణశర్మ, భట్టాచార్యులు వేదమంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం జరిపించారు. నేత్రపర్వంగా సాగిన కల్యాణ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం నిశీపూజ, స్వామివారికి బిల్వదళ సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. గౌతమినగర్ కోదండ రామాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఈవో ముక్తా రవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



టీఎన్జీవోస్ భవన్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు

- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి
- ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు

మంచిర్యాలటౌన్: విద్యార్థి దశ నుంచే భవిష్యత్ ప్రణాళికను ఎంచుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులతోపాటు వివిధ సంక్షేమ హాస్టళ్ల, కళాశాలల విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం మహిళా ఉద్యోగినులు, మహిళలు, విద్యార్థినులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా జాయింట్ సెక్రటరీ సునిత, పద్మజ, విజయలక్ష్మి, పద్మ, సరిత, నూర్జహాన్, అంజలి, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నం మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, మంచిర్యాల టౌన్ అధ్యక్షుడు గోపాల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కెజియారాణి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

డీటీఎఫ్ ఆధ్వర్యంలో..

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను డీటీఎఫ్ సీనియర్ నాయకురాలు కౌసర్ ఫాతిమా, హాస్టల్ వార్డెన్ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య వక్తలుగా టీచర్ నీలాదేవి, న్యాయవాది దివ్య, డీఆర్‌వో సాగరిక, పీవోడబ్ల్యూ నాయకురాలు మంగ, ఎఫ్‌బీవో నాగమణి, నాగలక్ష్మి పాల్గొని మాట్లాడారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అసంపల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శి మోతె జయకృష్ణ, జిల్లా కార్యదర్శి జాకీర్ హుస్సేన్, కొండయ్య, శ్రీమన్నారాయణ, సురేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జా సహించం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రభుత్వ భూముల దురాక్రమణ, కబ్జా సహించబోమని, కబ్జాదారులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పష్టం చేశారు. శుక్రవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో తమ తండ్రి దివంగత గడ్డం వెంకటస్వామి ఇందిరమ్మకాలనీ పేరుతో బోర్డు పెట్టి కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. భూ అక్రమణకు పాల్పడిన వ్యక్తులు తమ తండ్రి పేరును వాడుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములు కాపాడడానికి ఆర్డీవో, ఏసీపీ, అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వివరించారు. ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. కొందరు హోదా, స్థాయిని విస్మరించి తనపై విమర్శలు చేస్తున్నారని, సాక్ష్యాధారాలు లేకుండా తప్పుడు విమర్శలు చేస్తే పరువు నష్టం దావా వేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

స్మార్ట్‌హెల్మెట్ ఆలోచన అభినందనీయం

మంచిర్యాలఅగ్రికల్చర్: స్మార్ట్ ఫార్ములాతో ద్విచక్ర వాహనాన్ని హెల్మెట్‌కు అనుసంధానించిన విద్యార్థి ప్రతిభ అభినందనీయమని కలెక్టర్ బీ.సంతోష్ పేర్కొన్నారు. 'స్మార్ట్ హెల్మెట్' తయారు చేసిన మంచిర్యాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి వెన్నంపల్లి సిద్ధాంత్ సాయి శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు దానిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు నష్టాన్ని తగ్గించే ఉద్దేశంతో స్మార్ట్ హెల్మెట్ తయారు చేశాడని తెలిపారు. స్మార్ట్ హెల్మెట్ తలకు ధరించకపోతే ద్విచక్రవాహనం స్టార్ట్ కాకుండా సెన్సార్ అనుసంధానం చేసినట్లు సిద్ధాంత్ సాయి వివరించాడు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి నష్టపోవడమే కాకుండా అతడి మీద ఆధారపడిన కుటుంబ సభ్యులు కూడా ఎంతో నష్టపోతున్నారని తెలిపాడు. దీనిని నివారించేందుకు స్మార్ట్ హెల్మెట్ తయారు చేసినట్లు వివరించాడు.



కలెక్టర్‌కు హెల్మెట్ ఇస్తున్న సిద్ధాంత్ సాయి

క్లుప్తంగా

11న నేషనల్ అప్రెంటీస్ మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఐటీఐలో ఈనెల 11వ తేదీన నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించునున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ష్నేడర్ ఎలక్ట్రిక్ ఇండియా హైదరాబాద్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఆదర్శ ఆటో మొబైల్స్, ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 205 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, కోపా, ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ ట్రేడ్‌లలో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు మంచిర్యాల ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

బీమా కొనసాగింపుపై హర్షం

కోటపల్లి: కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది. ఇటీవలి బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తంజేస్తున్నారు. కాగా, 18–59 ఏళ్ల రైతులే ఈ పథకానికి అర్హులని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఏటా ఆగస్టు 14 నుంచి మళ్లీ ఆగస్టు 13వ తేదీ వరకు పథకం అమలులో ఉంటుందని తెలిపారు. ఏటా నిర్ణీత సమయంలో బీమా నమోదు చేసుకున్న రైతు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబానికి బీమా పరిహారం రూ.5లక్షలు అందుతుందని అధికారులు వివరించారు.

నకిలీనోటు కలకలం



పాన్‌షాపు నిర్వాహకుడికి వచ్చిన నకిలీ నోటు

తిర్యాణి: మండల కేంద్రంలోని ఓ పాన్‌షాపు వద్దకు గురువారం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పాన్లు కట్టించుకున్నాడు. పాన్‌షాపు నిర్వాహకుడికి నకిలీ 200 నోటు ఇవ్వగా గమనించని అతడు కౌంటర్‌లో వేసుకున్నాడు. కాగా, శుక్రవారం డబ్బులు లెక్కపెడుతున్న క్రమంలో 200 నోటు నకిలీదిగా గుర్తించి కంగుతిన్నాడు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని శుక్రవారం పట్టుకున్నట్లు తెలిసింది. సీసీఎస్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఇంట్లో భద్రపరచి ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ గంజాయి మూడు నుంచి మూడున్నర కిలోల వరకు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై 'సాక్షి' పోలీసులను సంప్రదించగా పట్టుబడ్డ గంజాయికి సంబంధించిన వివరాలను శనివారం వెల్లడిస్తామని తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన గజ్జెల గంగాధర్ (33) ఫిట్స్‌తో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గంగాధర్ ఇంట్లో ఉండగా ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ఇచ్చోడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కాగా ఈయన ఇచ్చోడలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233872]

హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-799851]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

పిట్టల్లా రాలి.. పెట్టెల్లో వచ్చి..

- ఉపాధి కోసం వెళ్తే ఆగుతున్న ఊపిరి
- అమలుకు నోచుకోని ఎన్నారై పాలసీ
- పాలకులకు పట్టని గల్ఫ్ సంక్షేమబోర్డు
- 'చితికిపోతున్న కార్మిక కుటుంబాలు
- ఆదుకోవాలని బాధితుల డిమాండ్



ఈ చిత్రంలోని మహిళ పేరు కొండగొర్ల సత్తవ్వ. జన్నారం మండలం మహ్మదాబాద్ గ్రామం. ఈమె భర్త శంకరయ్య ఉపాధి కోసం 2021లో ఇరాక్ వెళ్లాడు. అప్పు చేసి వెళ్లిన ఏడాదికే అనారోగ్యం బారిన పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. 2021 డిసెంబర్‌లో మృతి చెందగా, 2022 జనవరిలో మృతదేహం ఇంటికి చేరింది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం రోడ్డున పడ్డది. ముగ్గురు ఆడపిల్లల పోషణభారం, ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని వేధిస్తున్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న కునారపు వెంకటేశ్‌ది జన్నారం మండలం దేవునిగూడ గ్రామం. తొమ్మిది నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇక్కడ పని దొరకక ఉపాధి కోసం ఆర్నెళ్ల క్రితం ఏజెంట్‌కు డబ్బులు పెట్టి ఇరాక్‌లోని ఇబ్రహీల్ పట్టణానికి వెళ్లాడు. గత జనవరి 30న విధుల్లో ఉన్న ఇతడికి బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. వెంటనే కంపెనీ యాజమాన్యం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో వెంకటేశ్ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

ఇలాంటి దీనగాథలు మంచిర్యాల జిల్లాలోని చాలా గ్రామాల్లో కనిపిస్తాయి.





శవపేటికపై పడి ఏడుస్తున్న కుటుంబీకులు (ఫైల్)

జన్నారం: ఉన్న ఊరు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలను వదిలి ఉపాధి కోసం దేశం గాని దేశం వెళ్లినవారు ఆశలు తీరకుండానే అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. ఉపాధి వేటలో ఊపిరి వదిలి విగతజీవులవుతున్నారు. పెట్టెల్లో వస్తున్న శవాలను చూసి పుట్టెడు దుఃఖంతో బాధిత కుటుంబీకులు విలవిల్లాడుతున్నారు. గల్ఫ్ కార్మికులకు భరోసా కల్పించేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన గల్ఫ్‌బోర్డు, ఎన్నారై పాలసీ హామీకి ఇంకా మోక్షం కలగక పోవడంతో గల్ఫ్ కార్మికులకు భరోసా లేకుండా పోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఎక్స్‌గ్రేషియా హామీ అమలు చేయాలని గల్ఫ్ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుంచి రాష్ట్రానికి చెందిన 1,800 మంది గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో మృతి చెంది శవపేటికల్లో స్వగ్రామాలకు చేరుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మంచిర్యాల జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సుమారు తొమ్మిదివేల మందికిపైగా ఉపాధికోసం వివిధ దేశాలకు వెళ్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి అత్యధికంగా వలస లున్నాయి. ఇటీవలి ఘటనలు చూస్తుంటే ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందోనని గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లో నెలకొంది.

గుండెపోటు మరణాలే అధికం

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ అండ్ పబ్లిక్ హెల్త్ 2018 విడుదల చేసిన నివేదిక ప్రకారం ఎన్నారైలు, గల్ఫ్ కార్మికులు అత్యధికంగా గుండె పోటుతోనే మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది. పగలంతా ఎండలో, రాత్రి ఏసీలో ఉండాల్సి రావడం, మానసిక, శారీరక ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్లు, స్మార్ట్‌ఫోన్లు అధికంగా వాడడం లాంటి కారణాలతో అత్యధిక మంది గుండె సంబంధిత వ్యాధులతో మృత్యువాత పడుతున్నట్లు వెల్లడవుతోంది.

అమలుకాని ప్రభుత్వ హామీలు

2008లో పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన ఓ సమావేశంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తూ గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికి రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పటయ్యాక గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు ఎన్నారై పాలసీ, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడి స్వయాన కేసీఆరే సీఎం పదవిలో పదేళ్లున్నా ఆయనిచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



తెలంగాణ ఉద్యమంలో గల్ఫ్ కార్మికులమంతా ముందున్నాం. విదేశాల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష తెలియజేశాం. తెలంగాణ ఏర్పడ్డాక గల్ఫ్ కార్మికులను పట్టించుకుంటలేరు. వివిధ కారణాలతో అనేక మంది పిట్టల్లా రాలిపోతున్నా బాధిత కుటుంబాలపై కరుణ చూపడంలేదు. గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్నారై పాలసీ తీసుకువస్తేనే బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా కృషి చేయాలి.

– కల్లెడ భూమన్న, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

కలగానే ఎన్నారై పాలసీ, గల్ఫ్ బోర్డు

గత ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నారై పాలసీ, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీలు కలగా మిగిలాయని గల్ఫ్ ప్రతినిధులు వాపోతున్నారు. ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు అనేక సందర్భాల్లో ప్రమాదాలు, అనారోగ్యం, ఏజెంట్ల మోసాల కారణంగా మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. దీంతో వారినే నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. భార్యాపిల్లలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ క్రమంలో గల్ఫ్ సంక్షేమ బోర్డు ద్వారా బడ్జెట్‌లో నిధులు కేటాయించి గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

కేజీబీవీలో అధికారుల విచారణ

- విద్యార్థినులకు భోజనం పెట్టకుండా వేధించడంపై తల్లిదండ్రుల ఆగ్రహం
- బాధ్యులపై చర్యలకు డిమాండ్



విద్యార్థిని ద్వారా వివరాలు తెలుసుకుంటున్న ప్రవీణ్

చింతలమానెపల్లి: విద్యార్థినులకు భోజనం పెట్టకుండా వేధించిన వైనంపై శుక్రవారం చింతలమానెపల్లి కేజీబీవీలో అధికారులు విచారణ చేపట్టారు. సెక్టోరల్ అధికారి సుభాష్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, బాలల సంరక్షణ విభాగం చైల్డ్‌లైన్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విద్యార్థినులు పాఠశాలలో లేకపోవడంతో చైల్డ్‌లైన్ అధికారి ప్రవీణ్‌కుమార్ మండలంలోని డబ్బా గ్రామంలో ఓ విద్యార్థిని ఇంటి వద్ద వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులను కేజీబీవీకి తీసుకురావాలని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా పలువురు పాఠశాలకు చేరుకున్నారు. సెక్టోరల్ అధికారి సుభాష్ విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాలయం సిబ్బందితో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యార్థినులు పాఠశాలలో ఉండి మిగతా పరీక్షలకు హాజరు కావాలని అధికారులు కోరగా వారు నిరాకరించారు. తాము ఇంటి వద్ద ఉండే పరీక్షలకు హాజరవుతామని తెలిపారు. ఎస్వో శ్రీదేవి తమను పోలీస్ కేసులు పెడ్తామని బెదిరించారని, మానసికంగా వేధించారని ఆరోపించారు. కాగా, విచారణ నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు పరీక్షలకు విద్యార్థినులు ఇబ్బంది పడకుండా పాఠశాలలో గణిత బోధనకు వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, విద్యార్థినులకు ఎంసెట్, సంబంధిత పోటీ పరీక్షల శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు పరీక్షల్లో ఫెయిలైతే ఇన్‌స్టంట్ పరీక్షల్లోపు వారికి సిలబస్ బోధిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గణిత బోధనలో నిర్లక్ష్యం వహించిన, భోజనం పెట్టకుండా వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు. విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నా తమకు గత రాత్రి సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. గతంలోనూ వంట సరిగా చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. విద్యార్థినులు విద్యాసంవత్సరం నష్టపోవడమే కాకుండా, భోజనం పెట్టకుండా పోలీస్ కేసులు పెడతామని బెదిరించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నా దందాను అడ్డుకుంటున్నారు

- 'రేషన్' దందా వ్యాపారి ఎమ్మెల్యే వివేక్‌కు మొర
- బియ్యం వాహనాన్ని పట్టుకున్న నాయకులు
- డబ్బులిస్తే వదిలిపెట్టిన అధికార పార్టీ లీడర్లు
- ఎమ్మెల్యేతో ములాఖత్ చేయించిన మరో వర్గం
- వివాదాస్పదంగా మారిన అధికార పార్టీ నాయకుల తీరు



చెన్నూర్‌లో వివేక్‌తో మాట్లాడుతున్న వ్యాపారి

చెన్నూర్: మహారాష్ట్రలో రేషన్ బియ్యం దందా నిర్వహిస్తున్న ఓ వ్యాపారి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యాపారి మహారాష్ట్ర పరిధి, తెలంగాణ సరిహద్దులో సిరొంచలో రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. పొరుగు రాష్ట్రంలో బియ్యం కొనుగోలు, అమ్మకం చట్టబద్ధం కావడంతో అక్కడే స్థావరం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌తోపాటు జిల్లా నుంచి బియ్యం రవాణా అవుతుంటాయి. గత మూడు రోజుల క్రితం చెన్నూర్ మండలం గంగారం నుంచి బుధవారం అర్ధరాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గమనించి కొందరు కాంగ్రెస్ నాయకులు ఆ వాహనాన్ని పట్టుకొని హల్‌చల్ చేశారు. రాత్రిపూట అధికారులకు తెలిస్తే వాహనాలు సీజ్ అవుతాయని తెలుసుకున్న ఆ వ్యాపారితో కాంగ్రెస్ నాయకులు రాత్రికి రాత్రే రూ.1.50లక్షలకు బేరం కుదుర్చుకుని వదిలిపెట్టారు. ఈ విషయం కాంగ్రెస్ పార్టీలోనే మరో వర్గానికి తెలియడంతో ఇరువర్గాల్లో వివాదానికి దారి తీసింది.

మీ వాళ్లు ఇలా చేస్తున్నారని..

వాహనాలను అడ్డగించి, డబ్బులు వసూలు చేసిన విషయాన్ని దివ్యాంగుడైన ఆ వ్యాపారి చెప్పడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మరోవర్గం నాయకుల దృష్టికి వచ్చింది. ఈ నెల 7న చెన్నూరు మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు ఆ వ్యాపారిని కలిపించారు. ఆ వ్యాపారి 'కొందరు కాంగ్రెస్ నాయకులు నా దందాకు అడ్డుపడుతున్నారు. పార్టీకి ఎలాంటి సహాయం అయినా అందిస్తా, నా వ్యాపారానికి అడ్డుపడకుండా ఉండాలి' అని వేడుకున్నట్లు తెలిసింది. లబ్ధిదారులు దొడ్డు అన్నం తినకపోవడంతో చాలాచోట్ల డీలర్లు, మధ్యవర్తులతో బియ్యాన్ని అమ్మేస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ అధికారులే ఇన్నాళ్లు ఆయన వద్ద మామూళ్లు తీసుకుంటుండగా, తాజాగా అధికార పార్టీ నాయకులు దందాలో వేలు పెట్టడం వివాదాస్పదంగా మారింది. దీనిపై ఎమ్మెల్యే ఏం హామీ ఇచ్చారో, అధికారులు ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఏరియా వర్క్‌షాప్‌లో మహిళా సిబ్బందితో కేక్ కట్ చేయిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం

శ్రీరాంపూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆర్కే–8 డిస్పెన్సరీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సింగరేణిలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. వీరంతా పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు దేనిలోనూ తీసిపోరని, అవకాశం ఇస్తే ఏదైనా సాధించగలరని నిరూపిస్తున్నారని తెలిపారు. ధైర్యంగా ముందడుగు వేస్తే విజయం వారిదే అవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే వెంకటేశ్వర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, ఏరియా ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, వైద్యులు మురళీధర్, లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ గనులపై వేడుకలు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు గనులపై మహిళలతో కేక్ కట్ చేయించారు. ఏరియా వర్క్‌షాప్‌లో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, నాయకులు ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పాల్గొని ప్రసంగించారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ పిట్ కార్యదర్శి సదానందం, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు గునిగంటి నర్సింగరావు, ఆకుల లక్ష్మణ్, గజ్జి రమేశ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో యూనియన్ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ మహిళా ఉద్యోగులతో కేక్ కట్ చేయించారు. స్త్రీలు పురుషుల కంటే శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడంలో ఎప్పుడూ ముందే ఉంటారని పేర్కొన్నారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకుడు భీంరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరికస్వామి, ఉపాధ్యక్షుడు కలవేని శ్యామ్, నాయకులు తిరుపతి, రాజు, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి, సమ్మిరెడ్డి, సంతోష్, భీమ్, రవి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేయిస్తున్న జీఎం సంజీవరెడ్డి

భార్య తరఫు బంధువులు బెదిరించారని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

దండేపల్లి: భార్య తరఫు బంధువులు బెదిరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దండేపల్లి ఏఎస్సై పాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్గనూర్‌కు చెందిన గడికొప్పుల మహేందర్ (27)కు నస్పూర్‌కు చెందిన స్నేహితతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఏడాది కాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తాయి. పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈక్రమంలో భార్య తరఫు బంధువులు మహేందర్‌ను నానా బూతులు తిడుతున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. ఈనెల 5వ తేదీన లక్సెట్టిపేటకు పనిమీద వెళ్లిన మహేందర్‌ను భార్య తరఫు బంధువులు లచ్చయ్య, లక్ష్మి, మనోజ్, తిరుపతి, రాంబాయి అడ్డుకున్నారు. బూతులు తిట్టి బెదిరించారు. దీంతో ఇంటికి వచ్చిన మహేందర్ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి బాధపడ్డాడు. తీవ్ర మనస్తాపంతో అదేరోజు సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు చికిత్స కోసం లక్సెట్టిపేటకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కోతులదాడిలో చిన్నారులకు గాయాలు



కోతుల దాడిలో గాయపడ్డ చిన్నారులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శుక్రవారం కోతులు దాడిచేసి ఇద్దరు చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. కాలనీకి చెందిన కొరండ్ల రాహుల్‌తో పాటు బక్కశెట్టి మణి అనే ఐదేళ్ల చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులను క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రోజురోజుకూ కోతుల ఆగడాలు పట్టణంలో ఎక్కువ అవుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే కోతులను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులపై కక్షసాధింపు చర్యలా?

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి డీవైసీఎంవో కార్మికులు, సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) నాయకులు సిద్ధంశెట్టి రాజమొగిలి, పేరం శ్రీనివాస్, ఎస్.ప్రకాశ్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గతంలో టీబీజీకేఎస్‌తో కుమ్మక్కైన ఏరియాస్పత్రి అధికారులు నేటికీ అదే ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. సిబ్బంది, కార్మికులకు పనుల కేటాయింపు, పేషెంట్లను అడ్మిట్ చేసుకోవడం, మంచి మందుల పంపిణీ, పేషెంట్ల రెఫరల్ తదితర అంశాల్లో టీబీజీ కేఎస్ నాయకులు సూచించినట్లే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏరియాస్పత్రి అధికారులు, సిబ్బంది టీబీజీకేఎస్ నాయకుల కనుసన్నల్లో నడుచుకుంటున్నారని తెలిపారు. తద్వారా పేషెంట్లు, కార్మికులు ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారిన డీవైసీఎంవో, ఇతర అధికారులు పనిగట్టుకుని కార్మికులపై అసత్య ప్రచారాలతో వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కొందరు అధికారుల చేష్టలతో ఏరియాస్పత్రిలో ప్రశాంతత కొరవడిందని ఆరోపించారు. స్పెషలిస్ట్ వైద్యులను చిన్న డిస్పెన్సరీకి పంపించి అవమానించి, వారిని ఉద్యోగానికి రాజీనామా చేసే స్థితికి నెట్టివేస్తున్నారని తెలిపారు. ఈ తీరుగా నలుగురు వైద్యులు ఇప్పటికే రాజీనామా చేశారని గుర్తు చేశారు. రోజుకు 400 మంది వరకు పేషెంట్లు వస్తుండగా క్లర్కుల కొరత ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. మందులు, మెడికల్ పరికరాలు కావాలని అడిగిన వైద్యులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సీఎండీ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఏరియాస్పత్రిని ఇకపై నిర్వహించాలని, లేకుంటే న్యాయపోరాటం సాగిస్తామని పేర్కొన్నారు. ఏరియాస్పత్రి మనుగడకు యూనియన్ చేసే పోరాటానికి కార్మికులు, కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

నాగోబా ఆలయంలో శివరాత్రి పూజలు



నాగోబాకు హారతి ఇస్తున్న పూజారి మెస్రం శేకు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్ర దత్తు మహరాజ్ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని నాగోబా దర్శనం కోసం వచ్చిన భక్తులకు కేస్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం శేకు, మెస్రం వంశం ఉద్యోగస్తులు మెస్రం సోనేరావ్, మెస్రం శేఖర్‌బాబు ఉన్నారు.



ప్రవచనాలు బోధిస్తున్న కుమ్ర దత్తు మహరాజ్

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



మార్కండేయ మృతదేహం

నేరడిగొండ: పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో కానిస్టేబుల్ శుక్రవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది గ్రామానికి చెందిన కొక్కుల మార్కండేయ (52) నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కుంటాల జలపాతం వద్ద గల సోమేశ్వరుడి ఆలయం వద్ద శుక్రవారం బందోబస్తుకు వెళ్లాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురికావడంతో పోలీసు వాహనంలోనే నేరడిగొండ జాతీయ రహదారి వరకు తీసుకురాగా, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో నేరడిగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యాధికారి సద్దాం చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది సంతాపం ప్రకటించారు.